సాక్షి తిరుపతి

గురువారం । 14 । ఆగస్టు । 2025



బాధ్యతగా అటవీ సంరక్షణ

అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. - 8లో



గంగరంగ వైభవం

రేణిగుంట నడివీధి గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా సాగింది. రాత్రి నిమజ్జనంతో జాతర పరిపూర్ణమైంది. - 8లో



శ్రీసిటీ-వీఆర్‌వీ పరిశ్రమ వితరణ

శ్రీసిటీ- వీఆర్‌వీ పరిశ్రమ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించింది. - 8లో

న్యూస్‌రీల్

27 వరకు నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు అవకాశం

తిరుపతి సిటీ: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈనెల 27 వరకు పొడిగించారు. వరదరాజ నగర్ లోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో దరఖాస్తుల సమాచారం పొందవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఇతర వివరాలకు 8688888802, 9399976999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటించినట్లు డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర వైద్య సేవలు మాత్రం కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

తారకరామా స్టేడియంలో 'జెండా పండుగ'

తిరుపతి అర్బన్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీన జిల్లాస్థాయి వేడుకలను తిరుపతిలోని తారకరామా స్టేడియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా పండుగ జరిగేదని, అయితే వర్షాల నేపథ్యంలో మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

డీవైఈఓగా ఇందిరాదేవి



తిరుపతి అర్బన్ : తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి (డీవైఈఓ)గా ఇందిరాదేవి బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రేణిగుంట ఎంఈఓగా పనిచేస్తున్న ఆమెకు ఇన్‌చార్జి డీవైఈఓ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించిన బాలాజీని తిరుపతి అర్బన్ ఎంఈఓ విధులు కేటాయించారు.

జ్ఞానానికి సంస్కృతమే గమ్యం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గీర్వాణి

తిరుపతి సిటీ : జ్ఞాన సంపదకు, సంస్కృతికి గమ్యస్థానం సంస్కృతమేనని కేరళలోని చిన్మయ్ విశ్వ విద్యాపీఠం ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గీర్వాణి తెలిపారు. బుధవారం జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహించిన సంస్కృత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. గీర్వాణి మాట్లాడుతూ దైవభాషగా వెలుగొందుతున్న సంస్కృతాన్ని నేటి యువత అభ్యసించాల్సిన అవసరముందన్నారు. అనంతరం వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతంతోనే భారతీయ సంస్కృతి రక్షింపబడుతోందన్నారు. భాష ప్రాముఖ్యతను ఆధునిక సమాజానికి మరింత చేరువ చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, డీన్ రజనీకాంత్ శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ ఎస్.దక్షిణామూర్తి శర్మ, ప్రొఫెసర్ రంగనాథన్, డాక్టర్ భరత్ భూషన్ రథ్, డాక్టర్ ప్రదీప్‌కుమార్ బాగ్ పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తులు

తిరుపతి తుడా: స్విమ్స్ వైరాలజీ విభాగంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 6వ తేదీన స్విమ్స్‌లోని పాత డైరెక్టర్ కార్యాలయంలోని కమిటీ హాల్‌లో వాక్ ఇన్‌ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

పోక్సో చట్టంపై అవగాహన

తిరుపతి రూరల్: బాలికలపై జరుగుతున్న లైంగికదాడులు, అఘాయిత్యాలను నియంత్రించే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా తీసుకొచ్చిన పోక్సో చట్టం గురించి శ్రీ పద్మావతీ మహిళా వర్సిటీ న్యాయ శాస్త్ర విభాగం తరపున అవగాహన సదస్సు నిర్వహించారు. పేరూరులోని ప్రాథమిక పాఠశాలలో పిల్లలు, వారి తల్లిదండ్రులకు చట్టం గురించి వివరించారు. విశ్వవిద్యాలయ పీఎం ఉష, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కె. అనురాధ, న్యాయశాస్త్ర విభాగాధిపతి డా. సీతాకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. మాధురి పరదేశి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సునీత కాణిపాకం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.



మీ భూమికి పడిగాపులు

'మీ భూమి' పోర్టల్ అన్నదాతలకు చుక్కలు చూపిస్తోంది. అవసరమైన పత్రాల కోసం నెట్ సెంటర్ల వద్ద రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి కల్పిస్తోంది. దీంతో రైతులు సకాలంలో డాక్యుమెంట్లను బ్యాంకులకు అందించలేక రుణాలు పొందలేని దుస్థితి దాపురించింది. తరచూ పోర్టల్ మొరాయిస్తుండడంతో దిక్కుతోచక రైతాంగం కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వం కక్ష సాధించేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది. పాత పద్ధతిలోనే మీభూమిని అమలు చేయాలని డిమాండ్ వినిపిస్తోంది.

పోర్టల్‌కు లాగిన్ కష్టాలు

- భూముల సమాచారానికి లాగిన్ తప్పనిసరి
- కూటమి ప్రభుత్వం వింత ధోరణి
- సమాచారం తెలుసుకునేందుకు రైతుల అవస్థలు
- మొరాయిస్తున్న 'మీ భూమి' పోర్టల్.. ఓపెన్ కాని భూ నక్షత్ర
- వెబ్‌ల్యాండ్‌లో సకాలంలో తెరుచుకోని భూముల వివరాలు
- ఇదే అదునుగా దోచేసుకుంటున్న మీ సేవా, నెట్ సెంటర్లు

● చిత్తూరు జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని మారప్ప అనే రైతుకు 3 ఎకరాల భూమి ఉంది. అందులోని అర్ధ ఎకరాను పక్కన ఉన్న మరో వ్యక్తి ఆక్రమించుకున్నాడు. దీంతో ఆందోళన చెందిన మారప్ప తనకు చెందిన భూమి వివరాలను మీ భూమి పోర్టల్‌లో పరిశీలించుకునేందుకు సచివాలయానికి వెళ్లాడు. సచివాలయంలో ఉన్న వీఆర్‌వో మారప్ప భూమికి చెందిన వివరాలను తెలుసుకునేందుకు మీ భూమి పోర్టల్ పనిచేయడం లేదని తిప్పి పంపించేశాడు. ఐదు రోజుల తర్వాత మారప్ప తిరిగి మీ సేవా కేంద్రానికి వెళ్లి సమాచారం తెలుసుకుందామని వెళ్లాడు. అక్కడ కూడా అదే సమాధానం ఎదురైంది. ఇలా గత నెల 28వ తేదీ నుంచి మారప్ప మీ భూమి పోర్టల్ లో తన భూమి వివరాలు తెలుసుకునేందుకు అష్ట కష్టాలు పడుతున్నాడు.

● ఈ చిత్రంలో కనిపిస్తున్న భూమి తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం కందాడు పరిధిలోనిది. 2006లో భూ పంపిణీ పథకం కింద అదే మండలానికి చెందిన మహిళకు 5 ఎకరాలు కేటాయించారు. పద్దేళ్ల కిందట రెవెన్యూ అధికారులు భూమిని గుర్తించి సర్వే నంబర్ 246/పీ6, 7లో ఐదెకరాలు ఆమెకు అప్పగించారు. డీ నమూనా, పాసు పుస్తకాలు ఇచ్చారు. అడవిలా ఉన్న భూమిని అప్పు చేసి చదును చేశారు. అయితే రెండు రోజుల క్రితం తనకు ఆ భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారంటూ తిరుపతికి చెందిన ఓ వ్యక్తి మరోసారి జేసీబీ పెట్టి చదును చేశాడు. ఈ విషయం గురించి రెవెన్యూ అధికారులను వివరణ కోరితే.. 2024లో జేసీ చెప్పారని, ఇచ్చామని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఆ భూమికి సంబంధించి వివరాలు తెలుసుకోవాలని మీ భూమి పోర్టల్‌లో ప్రయత్నిస్తే ఎటువంటి వివరాలు కనిపించలేదు. గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి కేటాయించిన భూమినే ప్రస్తుతం ఉన్న రెవెన్యూ అధికారులు ఎలా చూపిస్తారని బాధితురాలు ప్రశ్నిస్తోంది.



గతంలో భూమిని చదును చేసిన దృశ్యం

● తిరుపతి జిల్లాలోని గూడూరు నియోజకవర్గంలో వెంకటప్ప అనే రైతుకు ఉన్న 5 ఎకరాల భూమిలో భూ తగాదాలు ఏర్పడ్డాయి. ఆ రైతు తన సమస్యను పరిష్కరించాలని గత నెల 29వ తేదీ గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అనంతరం మీ సేవా కేంద్రానికి వెళ్లి తన పేరుతో ఉన్న భూమి వివరాలను మీ భూమి పోర్టల్ లో పరిశీలించి చెప్పాలని సంప్రదించాడు. మీ భూమి పోర్టల్ లో భూ వివరాలు తెలుసుకోవాలంటే సెల్‌ఫోన్ కు ఓటీపీ వస్తుందని, అది చెబితేనే పోర్టల్ లో వివరాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని మీ సేవా ప్రతినిధి వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ఎక్కడ మోసం జరుగుతుందోనని భయపడిన రైతు వెంకటప్ప వివరాలు తెలుసుకోకుండానే వెనుదిరిగి వెళ్లిపోయాడు.

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ సమస్యలను పరిష్కరించకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తోంది. ఎన్నో సంవత్సరాలుగా సజావుగా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనసాగుతున్న మీ భూమి, భూ నక్షత్ర పోర్టల్‌లో కూటమి ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. గత నెల రోజులుగా కూటమి ప్రభుత్వం మీ భూమి పోర్టల్ లో తెచ్చిన కొత్త మార్పులతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సజావుగా సాగుతున్న మీ భూమి పోర్టల్‌కు ఓటీపీ లాగిన్‌ను ఏర్పాటు చేయడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు అధికమవుతున్నాయి. రైతులు, ప్రజలు తమ భూముల వివరాలను మీ భూమి పోర్టల్ లో తెలుసుకోలేక అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ తమ చేతుల్లో ఏమీ లేదంటూ చేతులెత్తేస్తున్నారు.

నెట్ స్పీడు లేకున్నా మొరాయింపే

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న మండలాల్లో నెట్ వేగం అంతంత మాత్రమే. నగరాల్లో మాత్రమే 5 జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లో నెట్‌వర్క్ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో ఇంటర్‌నెట్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉండే పరిస్థితి. ఈ క్రమంలో గ్రామాల్లో మీ భూమి వెబ్‌సైట్ లో వివరాలు పొందేందుకు రైతులు ఓటీపీ నమోదు చేశాకే వెబ్‌ల్యాండ్ ఓపెన్ అవుతోంది. నెట్ స్పీడు లేకపోయినా మీ భూమి పోర్టల్ ఓపెన్ అవ్వని పరిస్థితి క్షేత్రస్థాయిలో చోటు చేసుకుంటున్నాయి. గ్రామాల్లో మీ భూమి పోర్టల్ లో భూ వివరాలు పొందేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం మీ భూమి పోర్టల్‌కు లాగిన్ ఆప్షన్ పెట్టడంతోనే ఈ కొత్త కష్టాలు రైతులకు మొదలయ్యాయి.

పోర్టల్‌లో సమస్యలు

కూటమి ప్రభుత్వం మార్పులు చేసిన మీ భూమి పోర్టల్ లో వింత సమస్యలు ఎదురవుతున్నాయి. గత మీ భూమి పోర్టల్ ను పూర్తిగా తొలగించడంతో అందులోని సమగ్ర వివరాలు మాయమయ్యాయి. ప్రస్తుతం చాలా వరకు భూముల వివరాలు మీ భూమి పోర్టల్ లో కనిపించడం లేదు. ఈ సమస్యలు చిత్తూరు, తిరుపతి జిల్లాలు మొత్తం ఉన్నాయి. ఇదే సమయంలో పోర్టల్ మొరాయింపుతో రైతులకు అవసరమైన భూ పత్రాలు పొందలేక పోతున్నారు. రైతులు తమకు అవసరమైన పత్రాలు సకాలంలో బ్యాంకులలో ఇవ్వలేకపోతుండటంతో రుణాలు పొందలేక నష్టపోతున్నారు. రైతులు నెట్ సెంటర్‌ల వద్ద రోజంతా నిరీక్షిస్తున్నప్పటికీ తమకు అవసరమైన భూ పత్రాలను పొందలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల కక్ష సాధింపుతోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. మీ భూమి పోర్టల్ ను పాత పద్ధతిలోనే అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఓటీపీ లేకుంటే భూ వివరాలు రావంతే..

గతంలో భూములకు సంబంధించి 1బీ తీయాలన్నా.. అడంగల్ కావాలన్నా...ఎఫ్‌ఎంబీ అవసరం ఉన్నా ఆన్‌లైన్ సెంటర్‌కు వెళ్లి నిమిషాల్లో మీ భూమి పోర్టల్ లో పొందేందుకు అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం పుణ్యాన ప్రస్తుతం వాటిని పొందడం అంత సులభం కాదు. మీ భూమి పోర్టల్‌ను ఓపెన్ చేయాలంటే ముందుగా ఫోన్ నంబర్ నమోదు చేయాలి. ఆ తరువాత క్యాప్చా వస్తుంది. అది ఎంటర్ చేసిన తర్వాత ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్ చేస్తేనే వివరాలు ఓపెన్ అవుతాయి. ఈ తతంగం అంతా చేసేందుకు గంటల సమయం పడుతుంది. ఓటీపీ నమోదు చేసి వివరాలన్ని నమోదు చేశాక ఓకే నొక్కితే సర్వర్ మొరాయిస్తూ సైట్ ఓపెన్ కాకుండా పోతోంది. ఇలా మూడు సార్లు ఓటీపీ నమోదు చేశాక ఆ తర్వాత ఆ రోజుకి ఇక పై అవకాశం లేనట్టే. ఒకవేళ లాగిన్ అయిన కాసేపటికే సర్వర్ బిజీ వస్తుంది. ఈ సమస్యలతో రైతులు క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాత పద్ధతినే అమలు చేయాలి



అసలే భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి. అంతే కాని రైతులపై కక్ష సాధింపునకు పాల్పడే విధంగా కొత్త నిర్ణయాలు అమలు చేయడం సబబు కాదు. మీ భూమి పోర్టల్ లో తెచ్చిన మార్పులపై క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో అవసరమైన భూ పత్రాలు పొందలేకపోతున్నారు. ఎందుకు ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు అమలు చేస్తున్నారో అర్థం కావడం లేదు. పాత పద్ధతిలోనే మీ భూమి పోర్టల్ ను కొనసాగించాలి.

– గోవర్ధన్, రైతు, చిత్తూరు జిల్లా

గతంలో ఇంటి వద్దే తెలుసుకునే అవకాశం

రైతులు భూ వివరాలను గతంలో ఇంటి వద్దే తెలుసుకునే వెసులుబాటు ఉండేది. ఫోన్‌లో కాని కంప్యూటర్‌లో కాని క్షణాల్లో తమకు అవసరమైన భూ వివరాలను తెలుసుకునే వారు. పబ్లిక్ డొమైన్‌లో ఇప్పటి వరకు ఈ ప్రక్రియ సులువుగా ఉండేది. రైతులు తమకు అవసరం వచ్చినప్పుడల్లా భూములకు సంబంధించిన 1బీ, అడంగల్, ఎఫ్‌ఎంబీలను తీసుకుని అవసరమైన కార్యక్రమాలను వాటిని వినియోగించుకునేవారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. భూ వివరాలను పొందుతున్న వారి వివరాలను షాడో రూపంలో తెలుసుకునేందుకు కూటమి ప్రభుత్వం మీ భూమికి ఓటీపీ విధానం తీసుకొచ్చిందని ఆరోపణలు ఉన్నాయి.

అవసరమైన పత్రాలు పొందలేకపోతున్నా



నాకు 1బీ, ఎఫ్‌ఎంబీ పత్రాలు అవసరం పడ్డాయి. ఈ పత్రాల కోసం 20 రోజులుగా తిరుగుతున్నా. ప్రతి రోజు నెట్ సెంటర్ల వద్దకు వెళ్తున్నా. ప్రస్తుత ప్రభుత్వం మీ భూమి పోర్టల్‌కు ఓటీపీ విధానం అని కొత్తగా పెట్టిందంట. మొదట్లో ఆ ఓటీపీ చెప్పాలంటే భయమేసింది. తర్వాత చేసేదేమి లేక ఆ ఓటీపీ ని కూడా చెప్పాను. అయినప్పటికీ నాకు అవసరమైన భూ పత్రాలను పొందలేక పోయాను. సజావుగా సాగుతున్న మీ భూమి పోర్టల్ లో ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకుని రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. పూర్వపు విధానమే అమలు చేయాలి.

– నాగభూషణం, రైతు, చిత్తూరు జిల్లా

యథేచ్ఛగా శ్రమదోపిడీ



కర్మాగారం ముందు బైఠాయించిన నైట్ షిఫ్టు కార్మికులు

"నాలుగు పరిశ్రమలు మా ప్రాంతంలో నెలకొల్పితే ఉద్యోగం, ఉపాధి దొరుకుతుందని సంబరపడ్డాం. అయితే కంపెనీల యాజమాన్యం నిరంకుశ వైఖరిని చూస్తే దిక్కుతోచక నివ్వెరబోతున్నాం. రోజా 12 గంటల పాటు శ్రమదోపిడీకి పాల్పడుతుంటే మౌనంగా భరిస్తున్నాం. కనీస వసతులు కల్పించకపోయినా నోరెత్తకుండా పనిచేశాం. ఇక తట్టుకోలేక ఇన్నేళ్లకి తిరగబడ్డాం. వెట్టిచాకిరీ చేస్తున్నా వేతనంలో కోత విధించడం దారుణం. ప్రశ్నించినందుకు సెక్యూరిటీ సిబ్బందితో దాడి చేయించడం దుర్మార్గం" అంటూ రేణిగుంటలోని కార్బన్, నియో లింక్ పరిశ్రమ కార్మికులు మండిపడ్డారు. కంపెనీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

- కార్బన్-నియోన్ కంపెనీ శ్రమ దోపిడీపై ఆందోళన
- సెక్యూరిటీ సిబ్బందితో దాడి చేయించడంపై ఆగ్రహం
- 12 గంటలు పనిచేయించుకోవడంపై ఆవేదన

రేణిగుంట : తిరుపతిని ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా గుర్తించి రేణిగుంట విమానాశ్రయ రహదారిలో ఈఎంసీ1, సీఎంసీ-2లో పదుల సంఖ్యలో కంపెనీలు వెలిశాయి. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక యువతను అన్‌స్కిల్డ్ కింద కూలీలుగా పనిలో పెట్టుకుని శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయి. ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేసిన యువత జీతంలో కూడా కోత పెట్టడంతో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. రోడ్డెక్కి కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మిక సంక్షేమ చట్టాలు, కనీస వేతన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పొట్ట పోషణకు వస్తే

రేణిగుంటలోని కార్బన్, నియో లింక్ పరిశ్రమలో దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. కుటుంబ పోషణ కొరకు పొట్ట చేత పట్టుకొని చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడల్లో చిరు ఉద్యోగులుగా స్థానిక యువత వారి జీవితాలను దగా చేస్తున్నాయి. అయితే బుధవారం నియో లింక్ పరిశ్రమలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వందల మంది కార్మికులు రోడ్డెక్కారు. విధులను బహిష్కరించి నిరసన గళం వినిపించారు. లేబర్ చట్టాల ప్రకారం రూ.23 వేల కనీస వేతనం చెల్లించాల్సి ఉండగా ఆ సంస్థ 8 గంటల పని కాకుండా అదనంగా 12 గంటలు పని చేయించుకుంటూ కేవలం రూ.10వేల నుంచి రూ.13 వేలు మాత్రమే చెల్లిస్తోందని కార్మికులు వాపోయారు. మహిళలకి సైతం మౌలిక వసతులు కూడా కల్పించడంలో కంపెనీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిపై దాడి చేయించి, ఐడీ కార్డు బలవంతంగా తీసుకొని విధుల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎదురు తిరిగితే సెక్యూరిటీ దారుణంగా దాడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం, రాత్రి రెండు విడతలగా కార్మికులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సీఐ జయ చంద్ర, ఎస్‌ఐ సుధాకర్ హుటాహుటిన కంపెనీ వద్దకు చేరుకుని కార్మికులతో మాట్లాడారు. అనంతరం కార్బన్ యాజమాన్యం రంగంలోకి దిగి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. లేబర్ కమిషన్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి కార్మికులకు సమస్యలు పరిష్కరించాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు.



కంపెనీ ఎదుట డే షిఫ్ట్ కార్మికులు

గంగరంగ వైభవం


గంగమ్మ దర్శనం కోసం పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారి ప్రతిమ

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ముగిసిన రేణిగుంట నడివీధి గంగమ్మ జాతర

రేణిగుంట : నడివీధి గంగమ్మ దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బుధవారం ఉదయం నుంచే ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారిని సేవించుకుని పరవశించారు. ఈ క్రమంలో వేకువనే పసుపుతో చేసిన అమ్మవారి ప్రతిమను ఊరేగింపు తీసుకువచ్చి వేపాకు పందిరి కింద కొలువుదీర్చారు. ప్రత్యేక క్యూల ద్వారా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గంగమ్మను దర్శించుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

భారీగా కుంభం

సాయంత్రం అమ్మవారికి కుంభం పెట్టి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. భైరాగి వేషాలతో దిష్టి కుండలను నెత్తి న పెట్టుకుని మహిళలు, చిన్నారులు సమూహాలు గా నడివీధి గంగమ్మను సేవించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో భక్తులకు వసతులు కల్పించారు. అర్ధరాత్రి తర్వాత అమ్మవారి ప్రతిమను ఊరేగించారు. అనంతరం నిమజ్జనంతో జాతరను పరిపూర్ణం చేశారు.


అమ్మవారికి కుంభం సమర్పిస్తున్న భక్తులు


రేణిగుంటలో భక్తుల కోలాహలం

క్లుప్తంగా

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం చిన్నగోపరం గ్రామానికి చెందిన బాలిక (17) ఈనెల 5వ తేదీన అదృశ్యమైనట్లు బాలిక తండ్రి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి చిన్న కుమార్తె కనపడలేదని, స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటయ్య తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి


పెంచలయ్య మృతదేహం


పెంచలయ్య(ఫైల్)

వెంకటగిరి రూరల్ : తెలుగు గంగ కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలు.. బంగారుపేటలోని పల్లెవీధికి చెందిన వేలూరు పెంచలయ్య(45) మంగళవారం మధ్యాహ్నం బహిర్భూమి కోసం తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. కాలువ గట్టు మీద పెంచలయ్య మోటార్‌సైకిల్, చెప్పులను గుర్తించారు. అప్పటికే చీకటి పడిపోవడంతో బుధవారం ఉదయం కాలువలో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి పద్మావతిపురానికి చెందిన మహేష్ నాయుడు అనే నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు.

రెండు ప్రైవేట్ ట్రావెల్ బస్సుల సీజ్

– రూ.6లక్షల జరిమానా


సీజ్ చేసిన బస్సులతో అధికారులు

తిరుపతి మంగళం : జిల్లా రవాణాశాఖ అధికారులు బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో పర్మిట్ లేకుండా తిరుగుతున్న రెండు ప్రైవేట్ ట్రావెల్ బస్సులను సీజ్ చేశారు. రెండు బస్సులకు రూ.6లక్షల జరిమానా విధించారు. సకాలంలో ట్యాక్స్ చెల్లించకుండా వాహనాలను తిప్పితే సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

చెంచురెడ్డికి కన్నీటి వీడ్కోలు

- రాజకీయ గురువు పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


చెంచురెడ్డి అంత్యక్రియల్లో బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డికి అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం ఈమేరకు అంతిమ యాత్రలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. తన రాజకీయ గురువు పాడే మోశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాల కమిటీ మాజీ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, నేతలు పగడాల రాజు, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, ఉత్తరాజి శరవణ కుమార్, శ్రీవారి సురేష్, మున్నా రాయల్, జయశ్యామ్ రాయల్, పులి రామచంద్ర, కంతా ఉదయ్ కుమార్, యుగంధర్ రెడ్డి, నాగరాజు రెడ్డి, చెంచయ్య నాయుడు, చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, మధు రెడ్డి, దిలీప్, రంగయ్య, జీవీకే రెడ్డి, జై కష్టారెడ్డి, అట్ల రమేష్, యాకూబ్, సురేష్, దినేష్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 77,596 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,565 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.73 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వస్తే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

కలెక్టర్‌కు 'స్కోచ్' అవార్డు


వెంకటేశ్వర్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడంలో కలెక్టర్ వెంకటేశ్వర్, బృందం కృషికి స్కోచ్ పురస్కారం దక్కనుంది. బుధవారం ఈ మేరకు స్కోచ్ గ్రూప్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ దలాల్ అవార్డును ప్రకటించారు. సెప్టెంబర్ 20వ తేదీన న్యూఢిల్లీలో కలెక్టర్ వెంకటేశ్వర్ అవార్డును అందుకోనున్నారు.

'సీకామ్'కు అటానమస్ హోదా

తిరుపతి సిటీ: తిరుపతి అన్నమయ్య సర్కిల్‌లోని సీకామ్ డిగ్రీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా కల్పించిందని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యానికి అధికారిక ఉత్తర్వులు అందించారు. కళాశాలకు ఐదేళ్ల పాటు అటానమస్ హోదా వర్తిస్తుందని పేర్కొన్నారు.

8 టిప్పర్ల సీజ్


చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన టిప్పర్లు

తడ: తమిళనాడుకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న 8 టిప్పర్లను బీవీపాళెం సరిహద్దు ఉమ్మడి తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు బుధవారం సీజ్ చేశారు. మట్టి స్మగ్లింగ్‌కు కూటమి నేతల అండదండలున్నట్లు తెలిసింది. వారిలో విభేదాల కారణంగానే టిప్పర్లలో గ్రావెల్ తరలుతున్న విషయం అధికారులకు గుట్టుగా సమాచారం అందించినట్లు తెలుస్తోంది.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : తిరుపతి రైల్వేస్టేషన్ 3వ నంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద కదులుతున్న రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. వివరాలు.. ఉదయం 11:30 గంటల సమయంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా పరిగెత్తుకెళ్లి బయలుదేరుతున్న రైలు కింద పడిపోయాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని రైల్వేపోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించాలని వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440352765 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన


పొలం పరిశీలనలో బీఆర్‌సీ సభ్యులు

తిరుపతి రూరల్ : మండలంలోని వేమూరులో రైతు అయ్యప్ప నాయుడుకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం రాయలసీమ రీజియన్ బయో ఇన్పుట్స్ రిసోర్స్ సెంటర్ (బీఆర్‌సీ) ప్రతినిధులు 40 మంది సందర్శించారు. తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫామింగ్ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా రాష్ట్ర రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. ఏటీఎం మోడల్‌లో విత్తనాలు, దేశీయ పద్ధతుల్లో నారు నాటారు. అనంతరం బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, దశపర్ణి కషాయాలతో పాటు పంచగవ్య తయారీ విధానాలను అధ్యయనం చేశారు. చెరుకు సాగులో వినూత్నంగా ఆకుకూరలు, కూరగాయలు విత్తనాలు నాటారు. బీడు భూముల్లో పీఎండీఎస్ విత్తనాలను చల్లారు. పూర్తిస్థాయిలో కషాయాల తయారీ విధానాలను రైతు అయ్యప్ప నాయుడు క్షుణ్ణంగా వివరించారు. ప్రాజెక్టు అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ఏపీఎం సత్యనారాయణ, జిల్లా రిసోర్స్ పర్సన్లు నాగరాజు, నరేంద్ర పాల్గొన్నారు.

'పరిశోధక'.. వేదన తీరక!

తిరుపతి సిటీ : ఎస్వీయూ అర్థశాస్త్ర విభాగంలో ఒక పరిశోధక విద్యార్థి అవమానకర పరిస్థితిని ఎదుర్కొన్నారు. పీహెచ్‌డీ చేసేందుకు విభాగానికి వచ్చిన ఆ విద్యార్థి కూర్చోవడానికి గది లేక కాలేజీ వరండాలో నేలపై కూర్చొని నోట్సు రాసుకుంటున్నారు. ఇది గమనించిన ఎస్‌ఎఫ్‌ఐ ఎస్వీయూ కార్యదర్శి వినోద్‌కుమార్ తక్షణమే ఈ విషయాన్ని కాలేజీ వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి శాస్త్రీయ, మేధోపర అభివృద్ధికి ఆయువుపట్టుగా ఉన్న పరిశోధక విద్యార్థులకు గదులు కేటాయించకపోవడం అత్యంత దారుణమన్నారు. నేటికీ కొంతమంది ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందినా వారి చాంబర్లను వీడకపోవడం విచారకమని మండిపడ్డారు. పలు విభాగాలలో అనేక గదులు ఖాళీగా ఉన్నప్పటికీ పరిశోధకులకు గదులు కేటాయించకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థంకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొంతమంది అధ్యాపకులు పరిశోధకులను అకడమిక్ పనుల కంటే తమ వ్యక్తిగత, ఇంటి పనులకు వాడుకోవడం, వెట్టిచాకిరి చేయించడం దుర్మార్గమన్నారు. దీనిపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పరిశోధక విద్యార్థులతో కలిసి సంబంధిత విభాగాల ఎదుట నిరసనకు దిగనున్నట్లు హెచ్చరించారు.


కళాశాల వరండాలో కింద కూర్చుని నోట్స్ రాసుకుంటున్న విద్యార్థి

ఈ క్రమంలో వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

సచివాలయ సెక్రటరీలకు వేధింపులు

- తిరంగా ర్యాలీకి రాలేదంటూ 281 మందికి మెమోలు


మెమో

సెక్రటరీలకు జారీ చేసిన మెమో

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయ సెక్రటరీలకు వేధింపులు తప్పడం లేదు. అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ సర్వేలు, టెలి కాన్ఫరెన్స్‌లతో ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం నగరంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీకి హాజరు కాలేదంటూ 281 మంది సచివాలయ సెక్రటరీలకు మెమోలు జారీ చేశారు. దీనిపై సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు.

సర్కులర్ లేకుండానే..

తిరుపతి నగరంలో మంగళవారం ఉదయం 6 గంటలకే హర్ గర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సచివాలయ సెక్రటరీలు హాజరుకావాలని ఎలాంటి సర్కులర్ జారీ చేయలేదు. కనీసం వాట్సాప్ గ్రూప్‌ల్లో సైతం మెసేజ్ కూడా పెట్టలేదు. కేవలం సోమవారం రాత్రి నిర్వహించిన పీ4 సర్వే టెలీ కాన్ఫరెన్స్‌తో కార్యదర్శులందరూ ర్యాలీకి రావాలని ఓ మాట చెప్పి చేతులు దులిపేసుకున్నారు. అయినప్పటికీ కొంతమంది హాజరయ్యారు. అయితే అధికారులు తమ తప్పిదం మరచి సెక్రటరీలకు మెమోలు జారీ చేసేశారు.

ఎక్కువమంది మహిళలే

ఉదయం ఆరు గంటలకు నిర్వహించిన హర్ గర్ తిరంగా ర్యాలీకి ఎక్కువమంది మహిళా సెక్రటరీలు హాజరు కాలేకపోయారు . మెమోలు జారీ చేసిన 281 మందిలో దాదాపు 190 మంది మహిళ సెక్రటరీలే ఉండడం గమనార్హం. ఇంట్లో పనులు పూర్తి చేసుకుని ఉదయం 6 గంటలకే ర్యాలీకి హాజరు కావాలంటే మహిళలకు ఎంత ఇబ్బందో కూడా అధికారులు గమనించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా పీ4 సర్వే సచివాలయ కార్యదర్శుల పాలిట శాపంగా మారింది. ప్రతి ఒక్కరూ ఐదు కుటుంబాలను పీ4లో చేర్పించాలని అధికారులు ఒత్తిడి చేస్తుండడం ఇబ్బందిగా తయారైంది. వేళాపాళా లేకుండా టెలీకాన్ఫరెన్స్‌లు పెడుతుండడం సరికాదని కార్యదర్శులు వాపోతున్నారు. అధికారులు చేయాల్సిన పనులు కూడా తమపై రుద్దుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ 16 గంటలపాటు పనిచేయిస్తున్నారని, పైగా తీవ్రంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

బాధ్యతగా అటవీ సంరక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్ : అడవులు, వన్యప్రాణుల సంరక్షణను బాధ్యతగా తీసుకుని ఫారెస్ట్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం ఎర్రావారిపాళెం మండలం తలకోనలోని అటవీశాఖ అతిథిగృహంలో జిల్లా అటవీ, వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అడవుల సంరక్షణకు ప్రత్యేకంగా మియావకీ ప్లాంట్లను అభివృద్ధి చేయాలన్నారు. వన్యప్రాణులను ఎవరైనా వేటాడితే నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపాలని స్పష్టం చేశారు. ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం అందించాలని సూచించారు. అటవీ భూముల ఆక్రమణకు యత్నిస్తే కేసులు నమోదు చేయాలని కోరారు. అనంతరం అటవీ అధికారులు తయారు చేసిన అజెండాలోని అంశాల వారీగా సమీక్షించారు.

ప్రధాన అంశాలు ఇవీ...

- ఏనుగులు, చిరుతల వివరములను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి.
- ఎలిఫెంట్ అటాక్ ఫోర్స్‌ను మరింత అప్రమత్తం చేయాలి.
- ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన వారికి పరిహారం కింద సుమారు రూ. 60లక్షల చెల్లింపులకు ఆమోదం తెలిపారు.
- పెండింగ్‌లోని రెవెన్యూ, అటవీ భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించాలి.
- అటవీ, వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశాన్ని సెప్టెంబర్‌లో సత్యవేడు రేంజ్ పరిధిలోని ఉబ్బలమడుగు కమ్యూనిటీ బేస్ట్ ఎకో టూరిజం సెంటర్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.

సమావేశంలో అటవీ సంరక్షణాధికారి సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఆర్‌ఓ నరసింహులు, ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, డివిజనల్ అటవీ అధికారి శ్రీనివాసులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అరుణ్‌కుమార్, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పాల్గొన్నారు.

విధేయులకే 'పురస్కారం'?

తిరుపతి అర్బన్ : జాతీయ పండుగ రోజున జిల్లా స్థాయి అధికారుల చేతులమీదుగా పురస్కారం అందుకోవడమనేది ఉద్యోగుల కల. అవార్డు అందుకుంటే అందులోని సంతృప్తి అంతా ఇంతా కాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఉద్యోగులకు పంపిణీ చేసే ఉత్తమ పురస్కారాల ఎంపికకు సంబంధించి పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమకు విధేయులుగా పనిచేసే వారినే అవార్డులకు ఎంపిక చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

కూటమి పాలనలోనే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది ఆగస్టు 15న 93 విభాగాల్లో పనిచేస్తున్న 392 మందికి అవార్డులు అందించారు. అలాగే ఈ ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా 479 మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. సాధారణంగా ఒక్కోవిభాగానికి సరాసరిన 5 మందికి అవార్డులు ఇవ్వాల్సి ఉంది. ఉద్యోగుల సంఖ్య మేరకు, వారు అందించిన సేవలను పరిగణలోకి తీసుకుని పురస్కారాలకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే 479 మందిలో పోలీస్‌శాఖలోనే 100 మందికి, కలెక్టరేట్‌లోని 45 మందికి (కలెక్టరేట్, కలెక్టర్, జేసీ బంగ్లాలో పనిచేసేవారు), రెవెన్యూ శాఖకు 31 అవార్డులను అందించారు. వైద్య విభాగానికి మాత్రం 15 అవార్డులు, ఆర్టీసీలో 4,600 మంది ఉద్యోగులున్నప్పటికీ 4 అవార్డులు మాత్రమే దక్కాయి. మరోవైపు వందల సంఖ్యలో సేవలు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులకు కేవలం 3 పురస్కారాలు మాత్రమే ఇచ్చారు. వాణిజ్య పన్నులశాఖకు 2, దేవదాయశాఖకు 3, అటవీశాఖకు 5 అవార్డులు మాత్రమే ప్రదానం చేశారు. దీనిపై గతంలో పలువురు ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు.

500 మందికి పురస్కారాలు?

తిరుపతిలోని తారకరామా స్టేడియంలక్ష శుక్రవారం నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవం వేడుకల్లో 500 మందికి పురస్కారాలు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా కలెక్టరేట్‌లో అధికారులు విభాగాల వారీగా కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ సారైనా పారదర్శకంగా ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేస్తారా లేదా విధేయులకే కట్టబెడతారా అంటూ పలు విభాగాలకు చెందిన అధికారులు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అవార్డు గ్రహీతల జాబితా విడుదల కానుంది.

డ్రోన్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి కృషి


డ్రోన్‌లను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో డ్రోన్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీలో రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ మంజూరు కోసం పలు సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు స్పేస్ టెక్నాలజీ, డ్రోన్స్-స్పేస్ టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్, వర్చువల్ ప్రొడక్షన్, సెమీ కండక్టర్స్ వంటి సాంకేతికతలకు టెక్నాలజీ లెర్నింగ్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ శిక్షణ వసతులను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డ్రోన్ సిమ్యులేటర్ సాఫ్ట్‌వేర్‌తో ప్రాక్టీస్, క్లాస్ రూమ్ సౌకర్యాల కోసం గ్రౌండ్‌ను తనిఖీ చేసినట్లు వివరించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, డ్రోన్ డైరెక్టరేట్ ప్రణవ్, ఏరోస్పేస్ లిమిటెడ్ డైరెక్టర్ అంజలి, డిప్యూటీ డైరెక్టర్ ఆపరేషన్స్ కుంజలత, చేతల్ సింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కో-ఆర్డినేటర్ ఆచార్య ధర్మారెడ్డి, రుసా సీఈఓ వంశీకృష్ణ పాల్గొన్నారు.

శ్రీసిటీ-వీఆర్‌వీ పరిశ్రమ వితరణ

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని చార్ట్-వీఆర్‌వీ పరిశ్రమ సామాజిక బాధ్యతలో భాగంగా వరదయ్యపాళెం మండలం నాగానందపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యా వసతులు సమకూర్చింది. సుమారు రూ.31 లక్షల వ్యయంతో తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గది నిర్మాణాలను పూర్తిచేసింది. స్కూల్ ఆవరణ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించింది. మొక్కలు నాటి, స్కూల్ మొత్తానికి రంగులు వేయించింది. ఈ మేరకు బుధవారం శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి సమక్షంలో చార్ట్ ఇండస్ట్రీస్ ఎండీ పర్వేశ్ మిట్టల్, డైరెక్టర్ యామిని సిన్హా చేతులమీదుగా నూతన వసతులను ప్రారంభించారు. వీఆర్ హెచ్‌ఆర్ మేనేజర్ కంద స్వామి, ఎంఈఓ-2 గున్నయ్య పాల్గొన్నారు.


నాగనందాపురం పాఠశాల వద్ద వీఆర్‌వీ పరిశ్రమ ప్రతినిధులు